

ఇంధనాన్ని పొదుపు చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రకాశం చౌక్ నుంచి జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా జెసి రామ్ సుందర్ రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. ఇంధన పొదుపు అందరి బాధ్యత అన్నారు. ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జరుగనున్నాయన్నారు. ప్రతి ఇంటిలో ప్రతి ఒక్కరూ వీలైనంత వరకూ విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. ఈ ర్యాలీలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ అహ్మద్‌ఖాన్, ఇఇలు ఎన్.వెంకటేశ్వరరావు, వి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

'ప్రభుత్వం మరోసారి కౌలురైతులకు అన్యాయం చేయనుందా.. మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటల పరిహారం కౌలురైతులకు అందని ద్రాక్షగానే మారనుందా.. సాగుచేయని భూయజమానుల జేబుల్లోకి పంటల పరిహారం చేరనుందా' అంటే అవుననే సమాధానం వస్తోంది. పంట నష్టపరిహారం అంచనాలకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు అందుకు అద్దంపడుతున్నాయి. ఇ-క్రాప్ ఐడి నమోదు ఆధారంగా పంట నష్టపరిహారం పేర్లు రూపొందించాలని చెప్పడంతో కౌలురైతులకు అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఒకరైతుకు ఐదెకరాల వరకు మాత్రమే పంట నష్టపరిహారం ఇస్తామని చెప్పడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మిచౌంగ్ తుపాన్‌కు చింతలపూడి మండలంలో నేలకొరిగిన వరిపైరు(ఫైల్)

కౌలురైతులకు
పరిహా(రం)సమేనా..!

ఇ-క్రాప్‌లో పేరుంటేనే పరిహారం
కానీ భూయజమానుల పేర్లే ఇ-క్రాప్‌లో నమోదు
ఖరీఫ్ సాగులో 80 శాతం కౌలురైతులదే
ఐదెకరాల వరకు మాత్రమే పంటనష్టం
ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
26 వరకూ పూర్తిస్థాయి అంచనాల జాబితా విడుదలకు ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రెండుజిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌సాగులో 80 శాతం కౌలురైతులే సాగుచేశారు. పంట చివరి దశలో విరుచుకుపడిన మిచౌంగ్ తుపాను దెబ్బకు రెండు జిల్లాలోనూ భారీగా పంటనష్టం ఏర్పడింది. ప్రాథమిక అంచనాల ప్రకారం వరితోపాటు, వివిధ పంటలకు సంబంధించి ఏలూరు జిల్లాలో 85,425 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 68వేల ఎకరాలు మొత్తం లక్షా 50వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు తేలింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందాలు సైతం పరిశీలన చేస్తున్నాయి. ఈనెల 26వ తేదీకి దెబ్బతిన్న పంటలకు సంబంధించిన తుది జాబితాను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్యూమరేషన్ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు కౌలురైతులను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయి.

ఇ-క్రాప్ ఆధారంగానే పరిహారం

దెబ్బతిన్న పంటలకు సంబంధించి అందించే పరిహారం ఇ-క్రాప్ ఆధారంగా జరగాలని ప్రభుత్వ ఆదేశాలు జారీచేసింది. ఇ-క్రాప్ ఐడి ఆధారంగానే జాబితా తయారు చేయాలని తెలిపింది. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు లేవని అందరికీ తెలిసిందే. దీంతో పంటనష్టపరిహారం నమోదులో కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. కౌలురైతులు ఎకరాకు రూ.35వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. చేతిదాక వచ్చిన పంట వర్షార్పణమైంది. పలుచోట్ల పంటలను ట్రాక్టర్లతో దున్నిచేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాలు కౌలురైతులకు కోలుకోలేని దెబ్బగా చెప్పొచ్చు. కౌలురైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చూస్తే పంటనష్టపరిహారం జాబితాలో భూయజమానుల పేర్లు తప్ప, కౌలురైతుల పేర్లు ఉండే అవకాశం లేదని స్పష్టంగా తెలుస్తోంది. సాగుచేయని భూయజమానులకు పరిహారం ఏ విధంగా ఇస్తారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ప్రస్తుతం భూమి ఎవరు సాగుచేశారో వారికి పరిహారం ఇచ్చేవిధంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగితేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం భూయజమానులకు మేలు చేసేలా వ్యవహరిస్తోంది. ఇ-క్రాప్‌లో చాలామంది పేర్లు నమోదు కాలేదు. అలాంటి వారికి పరిహారం అందకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా రైతుకు ఐదెకరాల వరకు మాత్రమే పంట నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం తమ ఆదేశాల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. చాలామంది పది, అంతకుపైగా ఎకరాల్లో పంటను సైతం నష్టపోయారు. దెబ్బతిన్న పంటకు పరిహారం ఇవ్వకుండా ఐదెకరాలకు మాత్రమే అంటూ నిబంధన పెట్టడంపైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కౌలురైతులకు తీరని అన్యాయం జరిగే అవకాశం ఉంది.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి, ధర్నాలో పాల్గొన్న ఆశా వర్కర్లు

రోడ్డెక్కిన ఆశాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశాలు కదంతొక్కారు. కనీస వేతనాలు అమలుచేయాలని, పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ నినాదాలు చేస్తూ భీమవరం కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా గురువారం ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి ఆశాలు పెద్దఎత్తున తరలివచ్చి ఈ ధర్నాలో పాల్గొన్నారు. మధ్యాహ్నం వంటావార్పు చేసి భోజనాలు చేశారు. అనంతరం రాత్రి ధర్నా శిబిరంలో నిద్రించారు.

ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) మాట్లాడుతూ ఆశాల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి ఎన్నికల సమయంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ఎందుకు మాట్లాడంలేదని ప్రశ్నించారు. తాము శాసనమండలిలో ఆశాల సమస్యలపై అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే హక్కులు వస్తాయని, ఆందోళన మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆశాలు, అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కావాలనే ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చింతపల్లి లక్ష్మి, దిగుపాటి జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై పని భారాన్ని తగ్గించాలన్నారు. వారితో సంబంధం లేని పనులు చేయించడం బాధాకరమన్నారు. ఆశాల నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని, రూ.పదిలక్షల గ్రూపు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రికార్డులు ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. రూ.26వేలు కనీస వేతనం అమలు చేయాలన్నారు. విలేజ్ హెల్త్ క్లీనిక్, సచివాలయాల డ్యూటీలను ఆశాలకు వేయొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి, నాయకులు బేగం, ఆదిలక్ష్మి, దేవి, పద్మ, రాజేశ్వరి, స్రవంతి, దీపిక, రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్‌రాయ్, నాయకులు బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, జవ్వాది శ్రీను, బి.కళ్యాణి పాల్గొన్నారు.

సంబంధం లేని పనులు చేయిస్తున్నారు

బి.బేబీ రాణి, ఆశా కార్యకర్త, భీమవరం



ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులను కూడా చేయిస్తున్నారు. అత్యవసర డెలివరీ కేసులను విజయవాడ, ఏలూరు వంటి ఆసుపత్రులకు తీసుకెళ్లినప్పుడు అక్కడ సరైన మరుగుదొడ్లు కూడా ఉండటం లేదు. రెండు, మూడు రోజులు అక్కడే ఉండమంటున్నారు. ఇన్ని ఇబ్బందులకు గురిచేయడం దారుణం.

పని భారం తగ్గించాలి

ఎస్.లారెన్స్ కుమారి, ఆశాల యూనియన్ జిల్లా కోశాధికారి



ఆశాలపై పనిభారం పెరిగింది. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

యాప్‌ల భారం ఆపాలి

పి.కనకదుర్గ, ఆశ కార్యకర్త భీమవరం



నిత్యం ఫీల్డ్‌వర్క్ తలకుమించిన భారంగా మారింది. దీనికితోడు రికార్డు పని, యాప్‌ల వర్క్‌తో నరకయాతన అనుభవిస్తున్నాము. సమయపాలన లేదు. ఎక్కడ ఇబ్బంది వచ్చినా అప్పటికప్పుడు రావాలంటున్నారు. ఇలా అయితే మా పిల్లలను ఎలా చూసుకోవాలి. ప్రభుత్వం ఆలోచించాలి. పనిఒత్తిడి తగ్గించాలి.

కరోనా సమయంలో ఆశాల సేవలు మరువలేనివి

సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్



కరోనా సమయంలో ప్రజలంతా ప్రాణభయంతో అల్లాడుతుంటే ఆశా వర్కర్లు మాత్రం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించారు. అలాంటి వారిని ప్రభుత్వం విస్మరిస్తుంది. వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది ఆశ వర్కర్లు న్యాయమైన డిమాండ్లకై పోరాడుతున్నారు. ప్రభుత్వం వారిని గుర్తించాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

విమలకుమారి, ఆశ కార్యకర్త, తుందుర్రు




ప్రభుత్వం ఇస్తున్న అరకొర వేతనాల పేరుతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నిలుపుదల చేయడం దారుణం. ఆశాల్లో అధికశాతం మంది నిరుపేదలే ఉన్నారు. అలాంటివారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

టిడ్కో కాలనీలో సదుపాయాలు కల్పించాలని ధర్నా

భీమవరం రూరల్: పట్టణంలోని టిడ్కో ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఆ ఇళ్ల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టి ఏడేళ్లు గడిచినా ఇప్పటివరకూ మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. దీంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, మద్దాల రాంబాబు, రాచపల్లి మణి, అద్దూరి వెంకటలక్ష్మి, ఎం.భాగ్యలక్ష్మి, కె.సత్యవతి, మండల వెంకటలక్ష్మి, జి.పద్మ, పి.రేఖ పాల్గొన్నారు.

మిచౌంగ్ నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్



డిఆర్‌ఒకు వినతిని అందిస్తున్న నాయకులు

కరువు, మిచౌంగ్ తుపాన్ నష్టాన్ని జాతీయవిపత్తుగా ప్రకటించి రైతాంగానికి తక్షణసాయంగా రూ.వెయ్యి కోట్లు అందించి, శాశ్వత సహాయంగా రూ.పదివేల కోట్లు మంజూరు చేయాలని అఖిల పక్షాల రైతు సంఘాలు, సిపిఐ, సిపిఎం, ఫార్వర్డ్ బ్లాక్, టిడిపి డిమాండ్ చేశాయి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద అఖిల పక్షాలు, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయ కులు జుత్తిగ నరసింహమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మిచౌంగ్ తుపాన్ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల వరకూ 19 జిల్లాల్లో వర్షాభావంతో కరువు ఏర్పడితే చర్యల్లేవని, రైతులు, రైతు కూలీలు వలసలుపోతున్నా ప్రభుత్వం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మిచౌంగ్ తుపాన్‌తో 22 లక్షల హెక్టార్లలో పంటల తుడిచిపెట్టుకుపోయాయని, రూ.పదివేల కోట్ల నష్టం ఏర్పడిందని, దాన్నివెంటనే రైతాంగానికి అందజేయాలని డిమాండ్ చేశారు. తడిసిన రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తుందని, క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరేలా ఉన్నాయని ఎక్కడా మద్దతు ధరకు కొనుగోలు జరగడంలేదన్నారు. వరికి రూ.40 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యానవన పంటలకు రూ.70 వేలు పరిహారమిచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. వైసిపి ప్రభుత్వం ఇప్పటి వరకూ డెల్టాను ప్రక్షాళన చేసిన పాపానపోలేదని దీనివల్లే పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయని జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ కోట్లాది రూపాయల పంటనష్టం జరిగినా ఇప్పటికీ పైసా విడుదల చేయలేదని, కేంద్ర బృందాలు ఇప్పటి వరకూ కన్నెత్తిచూడలేదని విమర్శించారు. అనంతరం డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, ఎఐటియుసి జిల్లా నాయకులు సిహెచ్.రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణరావు, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారామ్‌ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొద్దాని నాగరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, మండల నాగేశ్వరరావు, నామాన వెంకటేశ్వరరావు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు శ్రీనివాసరాజు, కొత్తపల్లి సుబ్బరాజు,

కళ్లకు గంతలు కట్టుకుని.. మోకాళ్లపై నిలబడి..



పాలకొల్లులో అంగన్‌వాడీ దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు 3వ రోజు చేస్తున్న దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు 5 సంవత్సరాల క్రితం జగన్ ఇచ్చిన హామీ అమలు చేయాలని ఉద్యోగులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఈ స్థాయిలో పోరాటం చేస్తున్నా ఉద్యోగులతో కనీసం మాట్లాడకపోవడం అహంకారానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నేతలు, సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, వై.అజయ్, యుటిఎఫ్ నేతలు లక్ష్మీనారాయణ, రాంజీ, అంబేద్కర్ పాల్గొన్నారు.

గణపవరం : అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మూడో రోజు కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న అంగన్‌వాడీ సమ్మె శిబిరాన్ని జనసేన, టిడిపి ఉంగుటూరు నియోజవర్గ నాయకులు పచ్చమట్ల ధర్మరాజు, కూసంపూడి సురేంద్రరాజు, కె.చిన్న, కాంగ్రెస్ నాయకులు పాతపాటి హరికుమార్, రాజు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల నాయకులు బి.రామకోటి, కెవి.మహాలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు గురువారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎమ్‌డి.హసీనా బేగం మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల కమిటీ నాయకులు బి.రామకోటి, కెవి.మహాలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు టిడిపి మహిళా నియోజకవర్గ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి, డ్వాక్రా, అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ, నర్సాపురం పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు సయ్యద్, నశిమాబేగం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.విజయలక్ష్మి, సావిత్రి దుర్గ, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, మేరీ గ్రేస్ పాల్గొన్నారు.

మూడో రోజు అంగన్‌వాడీల వినూత్న నిరసన

మొగల్తూరు : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన దీక్ష మూడో రోజు గురువారం మోకాళ్లపై నిలబడి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యడ్ల చిట్టిబాబు, అంగన్‌వాడీలు జి.పెద్దింట్లు, కె.సీత, ఎస్.సారమ్మ, బి.రాజి, పి.రేఖశాంభవి, ఎం.ప్రియదర్శిని పాల్గొన్నారు. అంగన్‌వాడీల దీక్షలకు టిడిపి, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు, జనసేన నేత బొమ్మిడి నాయకర్ సంఘీభావం తెలిపారు.

ఆచంట (పెనుమంట్ర) : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు మూడో రోజు కొనసాగాయి. ఈ మేరకు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. సమ్మెకు పొలమూరు పంచాయతీ సర్పంచి కాకర రాజేశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు గంటి ఆంజనేయులు, చింతపల్లి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చిన వీరభద్రరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ కుమార్, సిఐటియు మండల కార్యదర్శి శ్రీనివాస్ ప్రసాద్ పాల్గొన్నారు.

తణుకురూరల్ : అంగన్‌వాడీ సెంటర్లకు వేసిన తాళాలు పగలగొడితే, వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ముక్కలు చేస్తారని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కోర్టు వద్ద 3వ రోజు సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, ఆంజనేయులు, జిఎం.రాజ కుమారి, కె.నళినీరాణి, జ్యోతి, కనకదుర్గ, వసంతకుమారి, ప్రమీల, మణిమాలతి, సాయి కుమారి పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి డి.రామకృష్ణ మద్దతు తెలిపారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మూడో రోజు కొనసాగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆధ్వర్యంలో వినూత్న రీతిలో మోకాళ్లపై నిలబడి ధర్నా నిర్వహించారు. జనసేన ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మాజీ శాసనమండలి ఛైర్మన్ షరీఫ్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, టిడిపి నాయకులు కొప్పాడి రవి, వాతడి ఉమా, **ఎకాళ్ల :** అంగన్‌వాడీలు సమ్మె విరమించాలని బెదిరింపులకు పాల్పడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం దారుణమని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ అన్నారు. మూడో రోజు సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మండా సూరిబాబు, యడవల్లి చంద్రావతి, ఝాన్సీ రాణి పాల్గొన్నారుగాగిడి రాంబాబు, పెండ్రా శ్రీనివాస్, కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.

ఉండి : తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా మూడో రోజు మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల వ్యవహరిస్తున్న మొండి వైఖరిని విడనాడాలన్నారు.

వీరవాసరం : అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే తాళాలు బద్దలుకొట్టి కేంద్రాలు తెరవాలని చెప్పడం అనాగరిక చర్య అని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. అంగన్‌వాడీల సమ్మె మూడో రోజు కొనసాగింది. ఈ మేరకు అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.నాగరత్నం, లక్ష్మి, నిర్మల, వై.వెంకటక్ష్మి, శాంతకుమారి, ఝాన్సీ, పార్వతి పాల్గొన్నారు.

ఆచంట : కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐసిడిఎస్‌ను ప్రయివేటుపరం చేయడానికి పలు ప్రయత్నాలు చేస్తోందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ అన్నారు. ఆచంట కచేరీ సెంటర్లో చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, నాయకులు ఆదినారాయణ, కుసుమే జయరాజు, కార్యకర్తల విజయలక్ష్మి, శ్రీదేవి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, జనసేన, టిడిపి నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీలతో కలిసి కళ్లకు గంతలు కట్టుకుని కొద్దిసేపు ఎంఎల్‌ఎ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జనసేన మండల అధ్యక్షులు పితాని వెంకట్, రావి హరీష్, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకట్రావు, బొంతు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె విరమించేది లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. దొరగారి చెరువు గట్టు నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకూ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోకాళ్లపై జాతీయ రహదారిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కె. తవిటి నాయుడు, అధ్యక్షులు పెంకి అప్పారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు కె.కృష్ణవేణి, యు.సీతామహాలక్ష్మి, కె.హిరానీదేవి, ఎ.రమాకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించి వారికి న్యాయం చేయాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార బ్యాంకు మాజీ ఉపాధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) మాట్లాడారు.



ఆచంట : కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తాడేపల్లిగూడెం : స్థానిక తాలూకాఫీస్ వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, మండల అధ్యక్షులు పుల్లా బాబి పాల్గొన్నారు.

కాళ్ల : అంగన్‌వాడీలు సమ్మె విరమించాలని బెదిరింపులకు పాల్పడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం దారుణమని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ అన్నారు. మూడో రోజు సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మండా సూరిబాబు, యడవల్లి చంద్రావతి, ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

పెంటపాడు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సమ్మెకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాస్, యుటిఎఫ్ మండల నాయకులు మురళీకృష్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్యామలరాణి, ఆర్.అనురాధ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, నాయకులు చిర్ల పుల్లారెడ్డి, వి.కనకమహాలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, నాగమణి, గాయత్రి, గంగాభవాని, హైమావతి, మంగతాయారు, లక్ష్మి, దుర్గ, లీలావతి పాల్గొన్నారు.

తణుకు : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. తణుకు, ఇరగవరంలో దీక్షలకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యలమంచిలి : సిఐటియు ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు గురువారం వినూత్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, నాయకులు రజిని, పద్మశ్రీ పాల్గొన్నారు.


ఉండిలో ధాన్యం శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

ఇప్పుడు సేకరిస్తే.. కొనేదెప్పుడు..!

రంగుమారిన ధాన్యం శాంపిల్స్ సేకరణలో కేంద్రబృందం హడావుడి

రెండుజిల్లాలోనూ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తడిసిన రంగుమారిన ధాన్యం సేకరణకు సంబంధించి కేంద్ర ఆధ్వర్యంలోని పౌరసరఫరాలశాఖ బృందం చేస్తున్న హడావుడి చూసి అంతా నివ్వెరపోతున్నారు. రంగుమారిన ధాన్యం శాంపిల్స్ ఇప్పుడు సేకరిస్తే కొనుగోలుకు ఎప్పటికి ఆదేశాలిస్తారంటూ రైతులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఐజిఎంఆర్ఐ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ బాసంత్ ఆధ్వర్యంలోని పౌరసరఫరాలశాఖకు చెందిన కేంద్ర బృందం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో గురువారం పర్యటించింది. పశ్చిమలో ఉండి, కాళ్ల, పాలకోడేరు, వీరవాసరంలోని పలు మండలాల్లో పర్యటించిన బృందం సాయంత్రం ఆరుగంటల తర్వాత ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం కేంద్రం చేరుకుని అక్కడ ధాన్యం శాంపిల్స్‌ను సేకరించింది. మిచౌంగ్ తుపాను దెబ్బకు రెండుజిల్లాల్లోనూ పెద్దఎత్తున పంట నష్టం జరిగింది. ముఖ్యంగా వరిపంటకు ఎక్కువ నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఏలూరు జిల్లాలో 85వేల ఎకరాలు, పశ్చిమలో 68వేల ఎకరాల వరకూ పంటనష్టం జరిగినట్లు లెక్కగట్టారు. ప్రస్తుతం పూర్తిస్థాయి లెక్కలకు సంబంధించి ఎన్యూమరేషన్ ప్రక్రియ సాగుతోంది. తుపాను దెబ్బకు పంటలు నేలకొరగడంతో రోజుల తరబడి నీటిలో నానుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం రంగుమారడంతోపాటు, మొలకలు వస్తున్నాయి. రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆదేశాలివ్వలేదు. ఇప్పటికే చాలా ధాన్యం రైతులు అయినకాడికి అమ్ముకున్నారు. దాళ్వా నారుమడులు వెంటనే వేయాల్సి ఉండటంతో రైతులు వేగంగా ఖరీఫ్ మాసూలు పూర్తిచేసేందుకు దిగారు. రెండుజిల్లాల్లో పెద్దఎత్తున మాసూళ్లు సాగుతున్నాయి. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. తాపీగా ఇప్పుడు వచ్చి రంగుమారిన ధాన్యం శాంపిల్స్ సేకరిస్తున్నారు. ఎప్పటికి రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు జారీచేస్తారో తెలియడం లేదు. మరో వారం, పదిరోజుల్లో ఖరీఫ్ మాసూలు పూర్తయ్యే అవకాశం ఉంది. తాపీగా రంగుమారిన ధాన్యంకొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినప్పటికీ రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదని తెలుస్తోంది. ఒకటి, రెండురోజుల్లో ఆదేశాలు జారీచేస్తే ప్రయోజనం ఉంటుంది. లేకపోతే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

పకడ్బందీగా సిఎం పర్యటన ఏర్పాట్లు

భీమవరం రూరల్: ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి భీమవరం పర్యటన నేపథ్యంలో గురువారం సాయంత్రం పెద్దిరాజు ఫిలిం పోర్ట్‌లోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక లేఔట్‌లో స్థలాన్ని, లూథరన్ హైస్కూల్ హెలీప్యాడ్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, జెసి ఎస్.రామ్ సుందర్‌రెడ్డితో కలిసి ఎంఎల్ఎ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. అధికారులు సిఎం పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు జరగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. లూథరన్ హైస్కూల్ హెలిప్యాడ్ పరిశీలించిన అనంతరం, హెలీప్యాడ్ నుండి ప్రకాశం చౌక్ వరకూ ప్రభుత్వ విప్ గ్రంధి. శ్రీనివాస్, జిల్లా కలెక్టరు ప్రశాంతి, ఎస్పి, జెసి బస్సు, కాన్వాయ్ తిరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, ఇపిడిఎసిఎల్ ఇఇ ఫీర్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి మహాప్రభో..

అర్తమూరు గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

తమ గ్రామంలోని ఉపాధి కూలీలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని అర్తమూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు మండల అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం మండల ఇన్‌ఛార్జి అభివృద్ధి అధికారి అందే కొండలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు, అర్తమూరు గ్రామస్తుడు రామకూరి వెంకటరత్నం మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో పంట పొలాలు ఆక్వా చెరువులుగా మారడంతో ఉపాధి కోల్పోయి నిరాశ్రయులమయ్యామని తెలిపారు. అధికారులు స్పందించి తమకు ఉపాధి కల్పించాలని కోరారు. స్పందించిన కొండలరావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పక్క గ్రామంలోనైనా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, జి.సంజీవరావు, కె.సురేష్, బి.సందీప్, కె.యోహాను, రాంబాబు, చిన్ని, రూబేను పాల్గొన్నారు.

పలుచోట్ల కేంద్ర బృందాల పర్యటన

ఉండి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసేందుకు పెద్దపుల్లేరులో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. వారు గ్రామంలో తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి విశ్లేషణ కోసం నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టంపై నివేదిక తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, గ్రామ వ్యవసాయ అధికారి కె.పరంజ్యోతి పాల్గొన్నారు.

కాళ్ల: మిచౌంగ్ తుపాను ప్రభావంతో నేలకొరిగిన పొలాలను, ధాన్యాన్ని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్ వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయీస్ డిఎంటి బి.శివరామ కృష్ణ, భీమవరం ఎడిఎ సి.శ్రీనివాస్, కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. మండలంలోని బొండాడ, బొండాడ పేట, కాళ్ల గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులతో మాట్లాడారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరారు. అనంతరం తడిసిపోయిన ధాన్యం శాంపిల్స్ సేకరించారు. ఈ పరిశీలనలో ఆకివీడు కెఎస్ఎస్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి చామర్తి జయవాసుకి, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

వీరవసరం : మండలంలో తుపాను కారణంగా నష్టపోయిన పంటను పరిశీలించడానికి వచ్చిన కేంద్ర బృందం నామమాత్రంగా పరిశీలించింది. గురువారం నందమూరి గరువులో ఒక ప్రాంతంలో ఒక చేలోని ధాన్యం నమూనాను తీసుకెళ్లారు. బృందంతోపాటు వీరవాసరం మండల వ్యవసాయ అధికారిని బిన్సీబాబు పాల్గొన్నారు.

ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పనిచేయడం లేదని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కాళ్లకూరులో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ, సిఎం రిలీఫ్ ఫండ్‌కు ఎంత ఖర్చు చేశారనేది శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రధానంగా తాగునీటి సమస్య నెలకొందన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచి అడ్డాల శివరామరాజు, జివి నాగేశ్వరరావు, తోట ఫణిబాబు, వేణు గోపాలరావు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన టిప్పర్

కిళ్లీ కొట్టు ధ్వంసం, కూలిన ప్రహరీ

పాలకొల్లు : పాలకొల్లు బ్రాడీపేట లారీ స్టాండ్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఇటుకల లోడ్‌తో ఉన్న టిప్పర్ రోడ్డు పక్కన నివాసముంటున్న రెడ్డి ప్రసాద్, రెడ్డి సుధాకర్ ఇంటిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి ముందు కిళ్లీ కొట్టు ధ్వంసమైంది. ఇళ్లకు సంబంధించి ప్రహరీ కూలిపోయింది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ప్రమాదం పగలు జరిగి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేది. పట్టణ ఎస్ఐ ముత్యాలరావు, ఎఎస్ఐ శివాజీ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధితులను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పరామర్శించారు. ఈ ప్రమాదంలో 2 మోటార్ సైకిళ్లు, ఫ్రిజ్‌లు, ఇన్వెర్టర్, విలువైన సామగ్రి, ప్రహరీ గోడ వంటివి పూర్తిగా ధ్వంసమయ్యాయి. బాధిత కుటుంబాలను ఆదుకునేలా లారీ యజమాని నుంచి పూర్తి నష్టపరిహారం ఇప్పించాలని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిఐతో చెప్పారు. తాను కూడా సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

రైతులను ముంచిన తొక్కోడు కాల్వ

ప్రజాశక్తి - వీరవాసరం

తుపాను ప్రభావం వీడినా తొక్కోడు మురుగు కాలువ పూడుకుపోవడం వల్ల రైతులు నిండా మునిగారు. దీంతో కళ్ల ముందరే చేతికొచ్చిన పంట నాశనమవుతున్నా చూడడం తప్ప ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు మిగిలారు. ఐదైదే సంవత్సరాలుగా తొక్కోడు మురుగు కాలువ సమస్యను రైతులు ఎదుర్కొంటున్నారు. వీరవాసరం మండలం నందమూరుగరువు నుండి ప్రారంభమైన మురుగుకాలువ తొక్కోడు మత్స్యపురి వద్ద గొంతేరులో కలుస్తుంది. వీరవాసరం, నందమూరుగరువు, బంటుమిల్లి, దూసనపడి, బాలేపల్లి, మెంటేపూడి, మత్స్యపురి గ్రామాల ఆయకట్టకు ఈ కాలువపైనే ఆధారపడి ఉంది. పది సంవత్సరాల క్రితం ఈ మురుగుకాలువ పూడిక తీత పనులు సవ్యంగా సాగలేదని అప్పట్లో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఓ బృందం పరిశీలించి రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని తవ్వకం పనులు మరోసారి పున:పరిశీలించాలంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయిప్పటికీ నాటి అధికారులు రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోలేదు. ఫలితంగా నేడు తమ పంట పొలాలలో చేరుకుపోయిన మురుగునీరు బయటకు వెళ్లక ముంపునకు గురైనట్లు రైతులు తెలుపుతున్నారు. నరసాపురం - భీమవరం ఆర్‌అండ్‌బి మార్గంలో కసనాలిబెదపూడి వద్ద తొక్కోడుకు తూరలు వంతెన వల్ల సకాలంలో మురుగునీటి పారుదల జరగడం లేదని తూరల స్థానంలో వంతెన నిర్మించాలని రైతులు ఎప్పటి నుంచో మొరపెట్టుకుంటున్నారు. ఏఒక్క అధికారి గాని, ప్రజాప్రతినిధులు గాని రైతుల మొర ఆలకించిన దాఖలాలు లేవు. భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సైతం తొక్కోడు సమస్యను పరిష్కరిస్తానని చేసిన వాగ్దానం అమలు కాలేదు. తొక్కోడుకు ఆక్వాచెరువుల యాజమానుల వల్ల కూడా కొంత నష్టం వాటిల్లుతున్నట్లు రైతులు చెబుతున్నారు. చెరువుల్లోని నీరు తొక్కోడులోకి తోడే క్రమంలో మురుగుకాలువ గర్భంలో మేటలు వేయడంతో మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతోందంటున్నారు. కొద్దిపాటి వర్షానికే చేలల్లోకి చేరిన నీరు బయటకు వెళ్లడానికి వారం రోజులు పడుతోందని రైతులు తెలిపారు. కోత దశలో పంట ఉండగా మిచౌంగ్ తుపాను కారణంగా పంట నేలనంటింది, దీనికితోడు చేలల్లో చేరుకుపోయిన మురుగునీరు బయటకు వెళ్లక పది రోజులుగా పంట నీటిలోనే నానుతోంది. కొన్ని ప్రాంతాల్లో పంట కుళ్లిపోయిందని మరికొన్ని ప్రాంతాల్లో పంటను కోయకుండానే చేలల్లో మొలకెత్తుతున్నాయి. ప్రస్తుతం పంటను కాపాడుకునే స్థితిలో రైతులు లేరు. ఎకరం పంటను కూలీలతో కోసి ఒబ్బిడి చేసుకోవాలంటే సుమారు రూ.20 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ఖర్చుకు తగ్గట్టుగా దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ఏంచేయలో పాలుపోవడంలేదంటూ రైతు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


బాలేపల్లిలో మురుగునీరు వెళ్లక కుళ్ళుతున్న వరి చేను

అభివృద్ధి ఘనత జగన్మోహన్‌రెడ్డిదే

గృహ నిర్మాణ శాఖా మంత్రి రమేష్

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ అన్నారు. గురువారం మండలంలోని రామన్నపాలెంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రామన్నపాలెం ఆర్అండ్‌బి రహదారి నుంచి లక్కు వారితోట వరకూ రూ.1.15 కోట్లతో నిర్మించిన ఆర్అండ్‌బి రోడ్డు, నరసాపురం ఐస్ ఫ్యాక్టరీ నుంచి సీతారాంపురం ఆర్అండ్‌బి రోడ్డు వరకూ రూ.2.20 కోట్లతో నిర్మించిన రోడ్డు, వంతెన, రూ.21.80 లక్షలతో నిర్మించిన రామన్నపాలెం రెండు రైతు భరోసా కేంద్రలు, 17.50, లక్షలతో నిర్మించిన రామన్నపాలెం-2 సచివాలయం పరిధిలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, తదితర భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామన్న పాలెం-1 సచివాలయం వద్ద ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు 30 లక్షల ఇళ్ల స్థలాలిచ్చి, 22 లక్షల మందికి ఇళ్లు కట్టిస్తూ 17 వేల జగనన్న నూతన కాలనీల నిర్మాణం ముఖ్యమంత్రి నేతృత్వంలో జరుగుతున్నాయన్నారు. నరసాపురం నియోజకవర్గంలో 12,500 మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. నిత్యం అభివృద్ధిని కోరుకునే వారు ప్రసాదరాజు అని కొనియాడారు. ఒక్క రామన్నపాలెం గ్రామంలోని రూ:26 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేయడమంటే సామాన్య విషయం కాదన్నారు. ఫిషింగ్ హార్బర్ ఆక్వా యూనివర్సిటీ ఇలా ఎన్నో పనులకు నిధులు తీసుకొచ్చి పనులు చేపడుతున్న ఘనత ప్రసాదరాజుకు దక్కుతుందన్నారు. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వినూత్న పాలన అందిస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంట పద్మశ్రీ మాట్లాడుతూ రామన్నపాలెం స్కూల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, జెడ్‌పిటిసి తిరుమాని బాబ్జి, గ్రామ సర్పంచి బందిల ఎలీషా, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

'వైసిపిని మరింత బలోపేతం చేయాలి'

భీమవరం రూరల్: పదవులు దక్కించుకున్న ప్రతి ఒక్కరూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైసిపి రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన నామన మహేష్ ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు.

యువగళం ముగింపు సభకు తరలిరండి

భీమవరం రూరల్: టిడిపి, జనసేన భీమవరం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జిల్లా టిడిపి అధ్యక్షురాలు భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతారామలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ జగన్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. యువగళం పేరుతో 400 రోజులు 4000 కిలోమీటర్లు సుదీర్ఘ లక్ష్యంగా జనవరి 27న ప్రారంభించిన యువగళం పాదయాత్ర ముగింపు మహాసభ ఈనెల 20వ తేదీన విజయనగరం జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడారు. ఈ సమావేశంలో టిడిపి డ్వాక్రా అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గభవాని పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి ఎస్ఎఫ్ఐ కృషి

నరసాపురం టౌన్ : ఎస్ఎఫ్ఐ నరసాపురం పట్టణ మహాసభ స్థానిక మీరా స్మారక విజ్ఞాన కేంద్రం వద్ద గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు, పెనుగొండ పట్టణ కార్యదర్శి ఈశ్వర్‌రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ నరసాపురంలోని విద్యార్థుల కోసం ఈ సంవత్సర కాలంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడేలాగా కెరియర్ గైడెన్స్ కార్యక్రమాలు, ప్రత్యేక సెమినార్లు నిర్వహించారని తెలిపారు. అనంతరం నూతన కమిటీని 17 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.సాయికృష్ణ, అధ్యక్షులుగా డి.అనిల్‌బాబు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి సాయికృష్ణ మాట్లాడుతూ ఈనెల 15, 16వ తేదీల్లో పాలకొల్లులో జరగబోయే ఎస్ఎఫ్ఐ జిల్లా 45వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.ప్రసాద్, ఎమ్‌డి.జాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్కెవిటి విద్యార్థినుల ప్రతిభ

తణుకురూరల్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్స్ ఉమెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 12, 13 తేదీల్లో ఎస్కెవిటి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రాజమండ్రిలో నిర్వహించారని, హైజంప్‌లో ప్రథమస్థానం యుఎన్‌డి భవాని, జావలిన్ త్రోలో ద్వితీయ స్థానం పి.రమ్య సాధించినట్లు ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో భీమవరంలో బాలోత్సవం

భీమవరం రూరల్ : ఈ నెల 30, 31వ తేదీల్లో పట్టణంలోని చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం బాలోత్సవం బ్రోచర్‌ను స్థానిక టీచర్స్ హోమ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాలోత్సవం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి మాట్లాడుతూ భీమవరంలో నిర్వహిస్తున్న బాలోత్సవాన్ని స్థానిక పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు జయప్రదం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సిహెచ్ పట్టాభి రామయ్య మాట్లాడుతూ భీమవరం మండలం, టౌన్, వీరవాసరం, పాలకోడేరు, కాళ్ల, ఉండి మండల పరిధిలో ఎల్‌కెజి నుండి పదో తరగతి విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోపు స్కూల్ పిల్లలు రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.జేమ్స్, సత్యనారాయణ రాజు, పి.సీతారామరాజు, కె.ప్రసాద్ సాయిరాం, రాజబాబు, సిహెచ్.చైతన్య ప్రసాద్, అరుణ్ పాల్గొన్నారు.

గణపవరంలో మినీ ఫిష్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

మాంసాహారులకు గణపవరంలో ఏర్పాటు చేసిన మినీ ఫిష్ అవుట్ లెట్ ఉపయోగకరమని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మినీ ఫిష్ అవుట్ లెట్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిపల్లి గ్రామానికి చెందిన తెనాలి సునీల్ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఫిష్ ఆంధ్రా షాపును నూతనంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై షాపును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం సర్పంచి మూర అలంకారం, ఉపసర్పంచి దండు రాము, మత్యశాఖ మండల అభివృద్ధి అధికారి శివరామకృష్ణ, మత్స్యశాఖ సహాయకురాలు షర్మిల దేవి పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ప్రధానోపాధ్యాయులు

నల్లబ్యాడ్జీలు ధరించి ప్రధానోపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, ప్రతి పాఠశాలలోనూ బోధనేతర సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం (ఎపిహెచ్ఎంఎ) జిల్లా అధ్యక్షులు నేలపాటి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తణుకులోని బాలుర ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధానోపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది నుంచి పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలని, విద్యాశాఖామంత్రి హామీ ఇచ్చిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్లస్ టు పాఠశాలలకు హెచ్ఎంలను ప్రిన్సిపళ్లుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డిఆర్‌వి సత్యనారాయణ, జిల్లా ట్రెజరర్ బండి ఆంజనేయులు, తణుకు డివిజన్ అధ్యక్షులు

క(వ)ర్రీ పాయింట్లు..!

మిగిలిన కూర తర్వాత రోజు అమ్మకాలు

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

పత్తాలేని తనిఖీ అధికారులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కర్రీ పాయింట్లు రోజురోజుకూ పుట్టగొడుగుల మాదిరిగా పెరిగిపోతున్నాయి. కస్టమర్లను ఆకట్టుకునేందుకు షాపు యజమానులు ప్రమాదకరమైన రసాయనాలు, కల్తీ నూనెలు, రంగులు, టేస్టింగ్ సాల్ట్ వంటివి వంటల్లో వాడేస్తున్నారు. ఇది ప్రజల ఆరోగ్యంపై పెనుప్రమాదం చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నేటి ఆధునిక యుగంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల చదువులు, ఇంటి అద్దె ఇతర ఖర్చులు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టేసి చిన్నాభిన్నం చేస్తున్నాయి. దీంతో భార్యాభర్తలు పనిచేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే విద్యావంతులైన మహిళలు వారికి తగ్గ ఉద్యోగాలు చేస్తుంటే, కొంత మంది షాపింగ్ మాల్స్, ప్రయివేటు సెక్టార్లలో పనిచేస్తున్నారు. అయితే అక్కడ పనిచేసి రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి వెళ్లి వంట చేయడానికి సమయం లేక కర్రీ పాయింట్ల నుంచి కూరలు కొనుగోలు చేస్తున్నారు. ఇది వ్యాపారవేత్తలకు ముఖ్యంగా హోటల్స్ యజమానులకు వరంగా మారింది.



జిల్లాలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం వంటి పట్టణాలతో పాటు నేడు గ్రామాల్లో సైతం ఈ కర్రీ పాయింట్లు పెద్ద ఎత్తున విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వ్యాపారం బాగానే సాగుతోందని చెప్పొచ్చు. ఇంత వరకూ బాగానే ఉన్నా అధిక లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో కొందరు కర్రీ పాయింట్ల వ్యాపారులు కల్తీ నూనె వాడుతున్నారు. అంతేకాకుండా కాల పరిమితి అయిపోయిన నూనెలను పెద్దపెద్ద మాల్స్ వద్ద కొనుగోలు చేసి వంటల్లో వినియోగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాటితో పాటు కూరగాయలను సైతం మార్కెట్ అయిపోయిన తర్వాత వినియోగదారులు కొనగా మిగిలిన వాటిని తక్కువ ధరకు తెచ్చి వండేస్తున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్, పీతలు, రొయ్యలు, చేపలు వంటి మాంసాహార కూరలు సైతం విరివిగా అమ్ముతున్నారు. అయితే ఈ కూరల్లో టేస్టింగ్ సాల్ట్, కలర్ వాడేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. దీనికి కారణం అధికారులు మామూళ్లు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికితోడు మిగిలిపోయిన కూరలు ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు వేడిచేసి అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ కూరలు తిని ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రులకు వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. ఏదేమైనా ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎటువంటి తనిఖీలు చేయకపోవడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు హోటళ్లపై, కర్రీ పాయింట్లపై దృష్టి సారించి కల్తీ నూనెల వాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేడు ఇంధన పొదుపుపై పోటీలు

తణుకు: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీన విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తణుకు విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజినీర్ సిహెచ్ రామకృష్ణ తెలిపారు. 15వ తేదీన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 16న డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు అదే రోజు ఉదయం 10 గంటలకు తణుకు సబ్ డివిజన్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు.